# వీరుడే లేచేను

వీ॥ వీరుడే లేచేను మరణపు ముల్లును విరచి
సాధ్యమా మంటికి ప్రభువునే ఉంచను అణచి ॥2॥
మనలను నమ్మి గొప్ప ఆజ్ఞను ఇచ్చి - స్థలము సిద్ధముచేయ వెళ్ళెనే
ఆత్మను పంపి తన శక్తితో నింపి - తనకు సాక్ష్యులుగా మనల చేసెనే
ఉరుము వల్లె ప్రకటించేసేయ్-ప్రభుని మహిమేంటో చూపించేసేయ్
వెలుగు వల్లె వ్యాపించేసేయ్ - జనుల హృదయాన్ని మండించేసేయ్
అరే నమ్మిన వారినే సూచక క్రియలు వెంబడించునెల్లప్పుడు ।2॥వీ॥

1. శృంగారం అనే ద్వారము నొద్దన - కుంటివాడు ఉండెనుగా
దేవాలయమునకు వచ్చుచుండిన - పేతురు యోహానులు చూస్తుండెనుగా
వెండి బంగారం మా యొద్ద లేదని - మాకు కలిగినదే నీకిస్తా చూడని
యేసునామంలో లేచి నీవు నడువని - పేతురు లేపేనుగా చేపట్టి అతనిని
గుమికూడిన ప్రజలంతా విస్మయమొందగా - శుద్ధాత్మ అభిషేకం బలము నివ్వగా
మమ్మునేందుకు చూస్తారు ప్రభువే మాకు చేశారు - అని పేతురు సాక్ష్యమిచ్చెనుగా
హెహె - వాక్యాన్ని నమ్మారు రక్షణను పొందారు
జనుల హృదిని వాక్కు పొడవగా
అరే నమ్మినవారినే సూచక క్రియలు వెంబడించునెల్లప్పుడు ॥2॥ ॥వీరుడే॥

2. లుస్త్ర అనేడి ఆ పట్టణమందున - కుంటివాడు నడిచెనుగా
పౌలు బర్నబా ఆత్మపూర్ణులై - అద్భుత క్రియెలెన్నో చేస్తుండేనుగా
దేవతలే మనుష్యులుగా వచ్చారు అనుకొని - అన్యులు పూనారే బలి అర్పించాలని
అయ్యో జనులారా ఇది యేమి పనియని - మేము మీలాంటి మనుష్యులమేనంటని
ఈలోక దేవతలను విడచిపెట్టండని - జీవముగల ప్రభు వైపుకు తిరగండని
అంతటను అందరును మారుమనస్సు పొందాలని - ప్రభువు ఆజ్ఞాపించెననెనుగా
హెహె-భూలోకమంతటిని తలక్రిందులు చేసుకుంటూ దేశాలన్నీ కుదిపివేసేగా
అరే నమ్మినవారినే సూచక క్రియలు వెంబడించునెల్లప్పుడు ॥2॥ ॥వీరుడే॥

3. దేవ కూమారుల ప్రత్యక్షతకై సృష్టి చూస్తూ ఉండెనుగా
విడుదల కోసమై మూల్గుచుండెనే - రక్షకుడు యేసయ్యే విడిపించునుగా
దేవ పుత్రుల ఇక ఆలస్యం ఎందుకు - యూదా సింహాంల దూకేయ్ నువ్వుముందుకు
యేసు నామంలో అధికారం మారదోయ్ - యేసు రక్తంలో శక్తి యెంటో చూపవోయ్
దయ్యాలను తరుమేసేయ్ రోగులను బాగుచేయ్ ప్రభు వల్లె జీవించివెలుగు పంచవోయ్
లోకాన జనమంతా సాతాను దుష్టనోట - గ్రుడ్డివారై కూలుచుండెనే ఆహ
సువార్త ప్రకాశమై కన్నులను తెరచును - ఇంకా వినుపించె సిలువ వార్తనే
అరే నమ్మినవారినే సూచక క్రియలు వెంబడించునెల్లప్పుడు ॥2॥ వీరుడే॥

# ఈ లోకమును జయించిన

ప॥ ఈ లోకమును జయించిన విజయము విశ్వాసమే ॥2॥
విశ్వాసమునకు కర్తయు కొనసాగించునది యేసే ॥2॥

1. ఆవగింజంత విశ్వాసం నీలో ఉంటే ॥2॥
కొండలైన కదులును సంద్రమైన చీలును
గాలైన అణచి దెయ్యమైన వదలి – యేసునకే మహిమ తెచ్చును
విశ్వాసమునకు కర్తయు కొనసాగించునది యేసే ॥లోకమును॥

2. నమ్మిన నీవు దేవుని మహిమ చూస్తావు ॥2॥
మృతులను లేపేడి యేసురాజే జీవము
మృతమైన లోక జనులను లేప – యేసువలె సాగిపోదునా
విశ్వాసమునకు కర్తయు కొనసాగించునది యేసే ॥2॥ ॥లోకమును॥

3. లేనివాటిని ఉన్నట్టు పిలుచును ప్రభువు
విశ్వసించి పలుకుదామ్ క్రియలను చూపుదామ్
జీవవాక్కు పలికి ఆత్మశక్తి చూపి – గొప్ప గొప్ప పనులు చేయుదామ్
విశ్వాసమునకు కర్తయు కొనసాగించునది యేసే ॥2॥ ॥లోకమును॥

4. నమ్మువారికి సమస్తం సాధ్యమే ప్రభుతో ॥2॥
ప్రభువు ఉన్నాడని వరము ఇస్తాడని
నీకై ప్రాణం పెట్టి మృతి గెల్చాడన్న – వార్త నమ్ము ఇదే జీవము
విశ్వాసమునకు కర్తయు కొనసాగించునది యేసే ॥2॥ ॥లోకమును॥

# నిబ్బరం కలిగి ధైర్యముగుండు

ప॥ నిబ్బరం కలిగి ధైర్యముగుండు - దిగులుపడకు జడియకు ఎప్పుడు ॥2॥
నిన్ను విడువడు నిన్ను మరువడు - ప్రభువే నీ తోడుండ
హల్లేలూయా...ఆ...ఆ...ఆమేన్ హల్లేలూయా ...ఆ...ఆ
ఊరక నిలిచి ప్రభువు చూపే రక్షణ చూద్దాము
నీ శత్రువులు ఇకపై ఎపుడు కనబడరన్నావు
హల్లేలూయా...ఆ...ఆ...ఆమేన్ హల్లేలూయా ...ఆ...ఆ ॥నిబ్బరం॥

1. పర్వతాలు తొలగినా మెట్టలు తత్తరిల్లినా
ప్రభు కృప మమ్మును విడువదుగా ॥2॥
ఎక్కలేని ఎత్తైన కొండను - ఎక్కించును మా ప్రభు కృప మమ్మును
ప్రభువే మా బలము
హల్లేలూయా...ఆ...ఆ...ఆమేన్ హల్లేలూయా...ఆ...ఆ... ॥ఊరక॥

2. మునుపటికంటెను అధికపు మేలును - మా ప్రభు మాకు కలిగించును ॥2॥
రెట్టింపు ఘనతతో మా తలను ఎత్తును
శత్రువు యెదుటనే భోజనము నిచ్చును - ప్రభువే మా ధ్వజము
హల్లేలూయా...ఆ...ఆ...ఆమేన్ హల్లేలూయా...ఆ...ఆ... ॥ఊరక॥

3. మా అంగలార్పును నాట్యముగా మార్చెను-బూడిద బదులు సంతోషమిచ్చెను ॥2॥
దు:ఖ దినములు సమాప్తమాయెను - ఉల్లాస వస్త్రము ధరియింపజేసెను
ప్రభువునకే స్తోత్రము
హల్లేలూయా...ఆ...ఆ...ఆమేన్ హల్లేలూయా...ఆ...ఆ... ॥ఊరక॥

4. స్త్రీ తన బిడ్డను మరచిన మరచును-మా ప్రభు మమ్మును మరువదుగా ॥2॥
చూడుము నా అర చేతిలోనే - చెక్కితి నిన్ను అన్నాడు ప్రభువు
ప్రభువే చూచుకొనును
హల్లేలూయా...ఆ...ఆ...ఆమేన్ హల్లేలూయా...ఆ...ఆ... ॥ఊరక॥

5. రాబోవు కాలమున సమాధాన సంగతులే – మా ప్రభు మాకై ఉద్దేశించెను ॥2॥
ఇదిగో నేనొక నూతన క్రియను చేయుచున్నానని – మా ప్రభువు చెప్పెను
ఇప్పుడే అది మొలుచున్
హల్లేలూయా...ఆ...ఆ...ఆమేన్ హల్లేలూయా...ఆ...ఆ... ॥ఊరక॥

6. మేము కట్టని పురములను మేమ్ నాటని తోటలను
మా ప్రభు మాకు అందించెను ॥2॥
ప్రాకారము గల పట్టణములోనికి
ప్రభువే మమ్మును నడిపింపజేయును – ప్రభువే మా పురము
హల్లేలూయా ఆ...ఆ... ఆమేన్ హల్లేలూయా...ఆ...ఆ... ॥ఊరక॥

# లోక పాపమును

ప॥ లోక పాపమును మోసుకెళ్ళినా దేవుని గొఱ్ఱెపిల్ల ॥2॥
నీ రక్తమే పాప పరిహారం – నీ దేహమే జీవ ఆహారం
నీ వాక్యమే మాకు ఆధారం – నీ నామమే రక్షణకు మూలం
నీ విజయమే మాకును విజయం ॥లోక పాపమును॥

1. మొదటి ఆదాముతో పాపము జనియించెను – మరణము సంక్రమించెను ॥2॥
ఆ పాపం పోవాలంటే ఈ మరణం తొలగాలంటే
మా వల్ల కానేకాదు పరిశుద్ధుడే రావాలి
ప్రభువా కడపటి ఆదామైనావు – కలువరి బలిపీఠము నెక్కావు
నీ ప్రాణమే బలిగా అర్పించి – మా ప్రాణాలను కాపాడావు
మరణాన్నే మ్రింగివేశావు ॥నీ రక్తమే॥

2. నీవు పొందిన దెబ్బలచే మాకు స్వస్థత నిచ్చావే
మా కోసం చీల్చబడినావే ॥2॥
సురూపమేమి లేక కురూపివైనవయ్యా
నిన్ను నలుగగొట్టుటకు తండ్రి ఇష్టమాయెనా
ప్రభువా నిశ్చయముగా మా రోగాలు – భరియించినావు నీ దేహములో
మా వ్యసనములన్నిటి సహియించి – మా శాపగ్రాహివైనావు
ఆరోగ్యము మాకు ఇచ్చావు ॥నీ రక్తమే॥

3. శ్రీమంతుడవు నువ్వు సృష్టాంతటిలో నువ్వు
అయిన తగ్గించుకున్నావు ॥2॥
నీవు సృష్టించిన ఈ భూవికి – దీనుడివై దిగివచ్చావే
మమ్మును ధనవంతులుగా చేయ – దారిద్రత నొందావే
ప్రభువా నీ తగ్గింపునకు సమమేది – నీ అద్భుత కృపకు మితియేది
నీ ప్రేమకు ఇలలో సాటేది – నీ వంటి రక్షకుడు మితియేది
నీ లాంటి ప్రేమ ఘనుడేడి ॥ నీ రక్తమే ॥

# యేసయ్యలోనే ఉన్నది

ప॥ యేసయ్యలోనే ఉన్నది మనకు రక్షణ నిరీక్షణ
యేసయ్యలోనే దొరుకును మనకు విడుదల విమోచన
స్వస్థత జీవము హే హే - జ్ఞానము ఆనందము
దేవుడే నరునిలో ఉండు భాగ్యము - దేవుని పిల్లలయ్యే ఆశీర్వాదము
యేసయ్యే తెచ్చాడు ఈ కృపావరం - తానే చెల్లించాడు మన క్రయధనం
నమ్మిన చాలు కలుగును మేలు - పూర్తిగా ఉచితమే ఈ దేవుని వరము ॥2॥

1. వ్యసనపు ఊచ్చులో ఉన్నవారికి - యేసులో విడుదల యే...యే...యే...
శాపపు దరిలో నలిగిన వారికి - యేసే విమోచన ల...ల...ల...
మానవ నీతి వ్యర్థము దేవుని నీతే జీవము ॥2॥ ॥నమ్మిన॥

2. పాపపు జీతమై మరణమొచ్చెను - మానవుని చంపెను అయ్యాయ్యో
యేసే మరణము గెలిచి లేచెను - మరణపు ముల్లు విరిచెను న...న...న...
యేసుడు పొందిన దెబ్బలే మనకు స్వస్థత నిచ్చెను ॥2॥ ॥నమ్మిన॥

3. జ్ఞానము కొదువగా ఉన్నవారికి - యేసే దైవ జ్ఞానము హా...హా...హా...
దీర్ఘాయువు ధన ఘనతలే - జ్ఞానపు అనుచర ఘనము హో...హో...హో...
దేవుని ఆశీర్వాదమే ఇచ్చును మహిమైశ్వర్యము ॥2॥ ॥నమ్మిన॥

4. అగ్ని గుండపు పాత్రులకు - ప్రభు కల్పించాడు రక్షణ హల్లెలూయా
మరల మన వారిని - చూస్తామనము ఉన్నది నిరీక్షణ ఆమేన్
ప్రభువే మన సమాధానం - ఆహా ఆత్మలో ఆనందం ॥2॥ ॥నమ్మిన॥

5. బలహీనుడు చెప్పును గాక - బలవంతుడను నేను యేసయ్యలో
ధనహీనుడ పలుకును గాక - ధనవంతుడను నేను యేసయ్యాలో
అంధుడు చెప్పును గాక - నే చూస్తున్న యేసయ్యను
మృతుడు తెలుపును గాక - నే తిరిగి జన్మించాను
పాపివి నీవు కాదిక - నే పరిశుద్ధుడ వేసయ్యలో
దోషివి నీవు కాదిక - నే నీతిమంతుడను నా యేసులో

# చేద్దామా పోరాటం

ప॥ చేద్దామా పోరాటం ఆత్మీయ పోరాటం
అపవాది శక్తులతో అనుదినము పోరాటం ॥2॥
ఏనాడో గెలిచాడు యేసు దేవుడు – శత్రువుని మన పక్షాన
అపవాది తలత్రొక్కి లేచినాడుగా
మనకివ్వ విజయాన్ని యే...యే...యే...
యేసు రక్తమే జయం జయం
అపవాది క్రియలకు అనంత నాశనం ॥2॥

1. మేమ్ చేసే ఈ యుద్ధం శరీరులతో కాదు
ఆకాశ దురాత్మలతో శక్తులతోనే పోరు ॥2॥
ప్రధానుల్ అధికారులెవరైనా అంధకార సంబంధ నాధులైనా
యేసయ్య నామంలో వంగాలి – యేసయ్య నామంలో ఓడాలి
యేసయ్య నామంలో వంగాలి, ఓడాలి – ప్రభునే మ్రొక్కాలి ॥యేసు రక్తమే॥

2. అపవాది తంత్రాలు మేమ్ ఎరుగని వారము కాము
మానోటి సాక్ష్యంతో ప్రభు రక్తంతో గెలిచెదము ॥2॥
సర్వాంగ కవచాన్ని ధరియించి – విశ్వాస డాలును ముందుంచి
అపవాది అగ్ని బాణాలార్పేస్తాం – శ్రమ శోధన దూషణలన్నీటిని జయిస్తాం
అపవాది అగ్ని బాణాలార్పేస్తాం, గెలిచేస్తాం – ప్రభునే స్తుతిస్తాం ॥యేసు రక్తమే॥

3. హృదయానికి ప్రభువిచ్చాడు నీతియనే కవచం
ప్రతి ఆలోచనను క్రీస్తు లోపరచి చరపడతాం ॥2॥
దేవుని నీతి యేమగునట్లు – మా నీతి ప్రభువే అయ్యాడు
సింహంలా ధైర్యముగా మేముంటాము – ఏడుమార్లు పడిన తిరిగి లేస్తాము
సింహంలా ధైర్యముగా మేముంటాము, లేస్తాము ప్రభునే చూస్తాము ॥యేసు రక్తమే॥

# విశ్వాస వీరులం

ప॥ విశ్వాస వీరులం క్రీస్తు శిష్యులం – దేవునికే మేమ్ వారసులం
పరలోక పౌరులం క్రీస్తు సాక్ష్యులమ్ – దైవరాజ్యపు యాత్రికులం
వెనుచూపుతో కాదు విశ్వాసముతో – మేమ్ నడిచెదమ్ ఎప్పుడు
విశ్వాసపు మంచి పోరాటమే పోరాడెదమ్ ఎప్పుడు

1. అబ్రహామును దేవుడు పిలిచెను – ఆశీర్వాదపు వాగ్ధానం ఇచ్చెను
అబ్రహాము దేవుని నమ్మెను – దేవుడు అతనికది నీతిగా ఎంచెను
ప్రభువు పిలువగానే యెటుకో తెలియకనే – కదిలేనుగా అబ్రహాము
యెహోవా యీరే అని కొడుకును – లేపునని అర్పించి పొందెను అబ్రహాము
విశ్వాసులకు తండ్రి అయ్యాడు – దేవునికే స్నేహితుడై పేరొందాడు ॥విశ్వాస॥

2. యోసేపుకు దేవుడు కలలిచ్చెను – ఫలించుకొమ్మగా ఆశీర్వాదించెను
యోసేపు దేవుని ప్రేమించెను – అన్ని వేళలా ప్రభువైపే చూచెను
గుంటలో త్రోసినను అన్నలు అమ్మినను – యోసేపు ప్రభునే నమ్మాడు
ప్రభువే తోడుండ శోధన జయించి – అధిపతిగా ఎదిగినాడు
బానిస కాస్తా రాజైనాడు – ఫరోకే తండ్రివలె రాజ్యమేలాడు ॥విశ్వాస॥

3. దానియేలుకు దేవుడు వరమిచ్చెను – కలల భావం వివరింప నేర్పెను
దానియేలు తన దేవుని ఎరిగెను – ప్రత్యేకముగా జీవించి చూపెను
రాజుకు మ్రొక్కనని ప్రభువే దేవుడని – దేవుని మహిమను చూపాడు
సింహపు గుహయైన ధైర్యముగా దూకి – సింహాల నోళ్లను మూశాడు
దానియేలు దేవుడే జీవము గల దేవుడని
రాజు చేత రాజ్యమంత చాటించాడు ॥విశ్వాస॥

4. సౌలును పౌలుగా దేవుడు మార్చెను – దైవవాక్యపు ప్రత్యక్షతనిచ్చెను
పౌలు యేసుని అంతట ప్రకటించెను – భూలోకమంతా సంచారం చేసి
క్రీస్తుని యోధునిగా శ్రమలను సహియించి – దర్శనమును నెరవేర్చాడు
జీవవాక్యమును చేతపట్టుకొని – సిలువ సాక్షిగా నిలిచాడు
తన పరుగును కడముట్టించి – విశ్వాసం కాపాడుకొని గెల్చాడు ॥విశ్వాస॥